# ప్రైవేట్ ట్యూషను—వడుగు

తాత కృష్ణమూర్తిగారు బి.ఏ; యల్.టి.

గొట్టికాయలాడకుండా మావాణ్ణి ఖాయిదా చేస్తే యెంత చదువైనా వొస్తుంది." "నాదగ్గిర గొట్టికాయలు, గిట్టికాయలు పనికిరావండి. పుస్తకం అంటుకుపోవాలి, అలాచదివిస్తానండి."

కన్యాశుల్కము.

ఇంటివద్ద కొన్నాళ్లదాకా ప్రైవేట్ ట్యూషన్ చెప్పించి, మాబావ నన్ను టవున్ స్కూలులో నాలుగోతరగతిలో ప్రవేశ పెట్టినాడు. కాని ఆయేడు పరీక్షలో నాకు మార్కులు తిన్నగారాలేదు. అయినప్పటికీ, మా బావవద్ద మొగమాటంచేత కాబోలు హెడ్ మాస్టరు నన్ను ఫెయిల్ చెయ్యలేదు.

"అబ్బాయీ, నీచదువు సంధ్యలు ఏమీ బాగులేవు. ఇటుపైని అయినా, శ్రద్ధగా చదివి బుద్ధిగా చదువుకుంటానని అంటేనే కాని నిన్ను పైక్లాసుకు ప్రమోషన్ చెయ్యను" అన్నాడాయన కళ్లెర్రజేసి.

అతి వినయంగా చేతులు నులుపుకుంటూ తలవంచుకొని ఆయనయెదుట నిల్చున్నాను. ఏం చెప్పడానికీ తోచలేదు నాకు. పరీక్షలు, మార్కులు, ప్రమోషన్లు—వీటి అర్థం ఇంకా నాకు సరీగా తెలియదు. 'చదువు కోవడం కదా ముఖ్యం? ప్లాసైతే నేం?' అనుకునే వాడిని.

ఫస్టుఫారానికి వచ్చినతరవాత నాకు యింటివద్ద చదువు చెప్పడానికి కొత్త ట్యూటరు కుదిరినాడు. అతగాడు మాహెడ్‌మాస్టరు గారి మేనల్లుడే. పేరు పార్వతీశ శర్మ. కాని అందుచేత మేనమామ బలవంతంమీద నాకు ట్యూటర్‌గా కుదురుకున్నాడు. మనిషి చిన్నవాడే. జుట్టుమాత్రం అక్కడక్కడ నెరుస్తూఉంది. ఒక కన్ను కొంచెం మెల్ల. బక్కపలచగా, చామనచాయగా ఉండే వాడు. నన్ను కొట్టకుండా మచ్చికచేసుకొని, ఓపికతో పాఠం చెప్పేవాడు.

మొదట నాకు ట్యూషన్ ప్రారంభించి నప్పుడు మంచిరోజుచూసి, వర్జాలు అవీ లేని సుముహూర్తాన నాచేత పుస్తకం చదివించాడు. నాకుగల లోకజ్ఞానం, భాషాపరిచయం, తెలివితేటలు యేమాత్రమో చూదామని కాబోలు, ఆవేళ నన్నొక కాంపొజిషన్ వ్రాయమన్నాడు.

"దేనిని గురించి రాయమన్నారు?" అని అడిగాను, కాగితం పెన్సిలుతీసి క్షణం ఆలో

చించి, "లొట్టిపిట్టనుగూర్చి వ్రాయి." అన్నాడాయన.

"దానినిగూర్చి నాకట్టే భోగట్టా తెలియదు. అది ఎట్లా ఉంటుందో నేనెన్నడూ చూడనైనా లేదు. బొమ్మలలో తప్ప కొన్నాళ్ళదాకా 'లొట్టిపిట్ట' అంటే, ఏదో పిట్ట కాబోలనుకునే వాడిని. తరవాత తరవాత తెలిసింది, అదొక వంకర టింకర మెడగల పెద్ద జంతువని. దానిని గూర్చి అట్టే తెలుసుకోవలసిన అగత్యంకూడా ఎన్నడూ కలగలేదు. సామితె మాత్రం యెరుగుదును. 'సంగీతానికి నేను; అందానికి మాఅప్ప లొటిపిట!' అన్నదట గాడిద." అని చెప్పాను.

"పోనీ, నీకు బాగా తెలిసిన జంతువును గూర్చే వ్రాయి. గుఱ్ఱంగూర్చి వ్రాయగలవా?" అన్నాడాయన నవ్వుతూ.

'ఓ' అని ధైర్యంగా చెప్పి వ్యాసం వ్రాయడానికి ప్రారంభించాను.

'చూడూ, నువ్వు చదువుకున్న వాచకాలలోని గుఱ్ఱంపాఠం అప్పజెప్పమనికాదు నా ఉద్దేశం. నీ అంతట నువ్వు స్వంతంగా ఆలోచించి వ్రాయాలి. పుస్తకాలలోని ఎంగిలి ముక్కలకు దేవులాడకూడదు. 'ఒరిజినాలిటీ' ఉండాలి నువ్వు వ్రాసేదానిలో. నీయిష్టం వచ్చినట్లు స్వేచ్ఛగా వ్రాయి!' అని ఉపదేశించి ఆయన గదివెలుపలికి వెళ్ళి, సిగరెట్ ముట్టించి, పచారుచేయడం మొదలుపెట్టాడు వరండామీద.

అరగంట అయింది; ముప్పావుగంట అయింది. నావ్యాసం పూర్తిఅయేటట్లు కనిపించలేదు.

నా వద్దకువచ్చి ఆయన, 'ఏమిటోయి, యింతసేపు వ్రాస్తున్నావు భారతంలాగ? ఆ వ్రాసింది చాలునులే. చూడనీ.' అంటూ నావ్యాసం అందుకొని తనలోచదువుకుంటూ నవ్వుకున్నాడు, కడుపు చెక్కలయేటట్లు, ఎందుకో.

నేను వ్రాసినది యిది:—

### గుఱ్ఱము

గుఱ్ఱము గాడిదజాతి జంతువులలో నొకటి. గేదెవలె దానికి కొమ్ములుండవు కాని, స్వాములవారి పాంకోళ్ళవంటి టక్కుటక్కులాడు డెక్కలుండును. దానికి నాలుగు మూలలను మంచము కోళ్ళవలె నాలుగు కాళ్లుండును—ఇనుపనాళ్లతోనున్న రాళ్ళవంటి డెక్కలతో! గుఱ్ఱమునకు బలమంతయు వెనుక కాళ్లలోనే యుండును.

ముఖమున కెదురుగా దానికి నిడుపైన పెద్దతోక యుండును. సహజముగా పెరుగనిచ్చినయెడల, తోక ముచ్చటగా ఆడపిల్లల

జడవలె యెదిగి వ్రేలాడుచు, పట్టి యీడ్వవలెనని బాలురకు బుద్ధి పుట్టించును. కాబట్టి కొందరు తోకను పొట్టిగా కత్తిరించెదరు. తోక పొడవునుబట్టి, గుఱ్ఱములలో రకము లేర్పడును. పొట్టితోక గుఱ్ఱమును స్వారి గుఱ్ఱమందురు. పొడుగుతోక గుఱ్ఱమును 'పోనీ' అందురు. మధ్యరకము తోక గుఱ్ఱమును జట్కా గుఱ్ఱమందురు.

ఇంకా తెల్లగుఱ్ఱము, నల్లగుఱ్ఱము, ఎఱ్ఱ గుఱ్ఱము, బొల్లిగుఱ్ఱము, పంచకళ్యాణి గుఱ్ఱము, పెద్దగుఱ్ఱము, చిన్నగుఱ్ఱము, కఱ్ఱ గుఱ్ఱము, తట్టగుఱ్ఱము, డంకాగుఱ్ఱము, ఆట గుఱ్ఱము, గుడ్డిగుఱ్ఱము, కుంటిగుఱ్ఱము, గుగ్గిళ్ల గుఱ్ఱము, తాపులగుఱ్ఱము, నీటిగుఱ్ఱము, అని అనేక రకముల గుఱ్ఱములుండును. బగ్గ బగ్గెలున్న పెద్దపులివంటి గుఱ్ఱమును, 'జీబ్రా' అందురు. మా స్కూలులో ఉమామహేశ్వరరావును శంఖుమూతి గుఱ్ఱమందురు.

అన్నిటికన్న హిందూదేశములో జట్కా గుఱ్ఱములే జాస్తి. అవి ముందుకు, వెనుకకు కూడ నడువగలవు. ఒక్కొక్కప్పుడవి రోడ్డు మీద అడ్డముగా కూడ నడచుచుండును,— గిర గిర గుండ్రముగా తిరుగుచుండును— దారిపోయే మనుష్యుల మీదికి దుముకుచుండును.

పూర్వము మనదేశములో రాజకుమారులందరకును కీలుగుఱ్ఱము లుండెడివి. వాటికి రెక్కలుండెడివి కాబట్టి, అవి సప్త సముద్రములను దాటుచుండెడివి.

గుఱ్ఱము మిక్కిలి దుష్టస్వభావము కల జంతువు. వీపుమీద స్వారిచేయుటకు ముచ్చటపడు బాలురను మోసముచేసి, క్రింద పడవేయుటే దాని ముఖ్యలక్షణము. అదిగాక, నూతిపళ్లురాలున ట్లది వెనుక కాళ్లతో తన్నగలదు. లేదా వెక్కిరించునట్లు పండ్లికిలించి, పైబడి కఱవగలదు.

తక్కిన జంతువులవలె గుఱ్ఱము పనికివచ్చే జంతువుకాదు. మన పూర్వులకాసంగతి తెలియక, గుఱ్ఱములను శ్రద్ధగా పెంచి వాటికి దంతధావనము కూడ చేసెడివారు. అందుకనే మావాళ్లు నన్నొక్కొక్కప్పుడు, 'ఏమిరా, ఇంతసేపును నీ వేమి రాచకార్యము చేయుచుంటివి? పెద్ద గుఱ్ఱమునకు పళ్లుతోముచుంటివా?' అని యడుగుచుందురు. ఇంట్లో గుఱ్ఱమున్నయెడల ఉపయోగము తక్కువేకాని, ఉలవల ఖర్చు యెక్కువ! ఎక్కి తిరుగుదామంటే, దానిమీదినుండి పడి, కాళ్లు, చేతులు విరుచుకుంటామేమో అని భయము. గుఱ్ఱమును బండికి కట్టినా ప్రయోజనము లేదు. మీదుమిక్కిలి, యెంత చక్కని బండి అయినా, మూడురోజులలో ముక్కలవక తీరదు. పర్లాకిమిడిలో రాజుగారి గుఱ్ఱ మొక

మాటు బగ్గీతోసహా చెఱువులోనికి దుమికిన దట !

కాని, చాకలి పెళ్లిలో పెండ్లికొడుకును కూచోబెట్టుటకు గుఱ్ఱము పనికివచ్చును. వైద్యులు కొందరు గుఱ్ఱపు చెమటతో అశ్వగంధలేహమును చేసెదరు. పూర్వము మనరాజులు అశ్వమేధయాగమని, యేదో పండుగ చేసుకొని, గుఱ్ఱములను చంపి తినెడివారు.

మొత్తముపైని గుఱ్ఱము గాడిదకంటె విరుపయోగమైన జంతువు అందుకనే మన వాళ్లు తరుచుగ మొగపిల్లడిని తిట్టవలసివచ్చినప్పుడు, 'ఓరి గాడిద! ఓరి పశువ! పెద్ద అడ్డగాడిదలాగున్నావు కదా, బుద్ధిలేదూ ?' అనెదరు. అంతేకాని, 'ఓరి గుఱ్ఱమా !' అని తిట్టరు. ఆడపిల్లని మట్టుకు, 'మంచి యేపైన గుఱ్ఱమువంటి పిల్ల! ఇంకా పెళ్లీ లేదు, పెడాకులులేవు.' అనెదరు.

* * *

'చబాష్ ! నిజంగా 'ఒరిజినాలిటీ' ఉందోయి నీ వ్యాసంలో కాని జాగ్రత్తసుమా, పరిక్షలలో కూడా యిట్లాగే వ్రాశావంటే, సున్న వస్తుంది నీకు !' అన్నాడు ట్యూటరు నవ్వుతూ.

'ఏం ?' అన్నాను ఆశ్చర్యంతో.

పరిక్షలలో విద్యార్థులు తమ సొంతభావాలను ప్రకటించుకో కూడదనీ, 'ఒరిజినాలిటీ'ని పూర్తిగా చంపుకోవాలనీ, పుస్తకాలలో చదువుకున్న ముక్కలే చిలుకపలుకులవలె అప్పజెప్పాలనీ, యింకా ఏవేవో కొన్ని ధర్మసూత్రాలు బోధించాడాయన.

నాతో సమానంగా ఆడుతూ, పాడుతూ, నన్ను కొట్టకుండా, తిట్టకుండా, బుజ్జగించి, శ్రమతీసుకొని పాఠాలు చెప్పేవాడు. మొత్తానికి, ఆయేడు పరిక్షలలో ఆయనకు మాట దక్కించి, మంచి మార్కులే తెచ్చుకోగలిగినాను.

ఆయేడు వేసంగి సెలవులలో నాకు ఉపనయనం చేస్తామన్నారు మావాళ్లు, చోర్లంగిలో—మా చిన్నఅన్నయ్య సారెతోపాటు ! ఖర్చువెచ్చాలు కలసివస్తాయని కాబోలు, రెండు సుముహూర్తాలు ఒక్కమాటే పెట్టుకున్నారు. చుట్టాలు, స్నేహితులు చాలా మంది వస్తారని తెలిసింది. శర్మగారిని కూడా నాతో చోర్లంగి రావలసినదని ఎంతో ప్రార్థించాను. మా బావచేత కూడా చెప్పించాను. కాని ఆయన మొగమాటంపడి రాలేదు.

మంచి వైభవంగానే జరిగింది నావడుగు! ఒకనాడు హరికథ, ఒకనాడు వీణపాట— ఇట్లా రోజూ ఏదో ఒక కాలక్షేపం ఉండేది. నాకు మాత్రం నలుగురిలో తలెత్తుకొని తిరి

గిందుకే ఎందుకో సిగ్గుగా ఉండేది. నా పంచసిగలు, పసుపుగోచి, నా వేషం, చూసి అందరూ నవ్వుకుంటున్నారా అనిపించేది నాకు. కళ్ళు, కాళ్ళు ఎగరవేస్తూ సానివాళ్ళు ఆడుతూఉంటే, సభలో అందరికీ బలే ఉల్లాసంగా ఉండేది. నేనూ అప్పటికి అట్టే చిన్నవాడినికాను; పన్నెండేళ్లవాడిని. కాని ఎందుకో ఆ వేశ్యలను చూస్తే నాకు కోపంగా ఉండేది. వచ్చిన బంధువు లెవరికీ నామీద దృష్టేలేదు. ఆ పందిళ్ళు, ఆ సంత్రప్పణలు, ఆ బాజాలు, ఆ హడావిడి,—అవన్నీ నా వడుగుకు సంబంధించినవికావు కాబోలు !

ఇక ఆడవాళ్లందరూ మా వొదిన గదిలో చేరేవారు. సారెపెల్లికూతురని దానికి పళ్లు, పువ్వులు, రవికలగుడ్డలు, మిఠాయిపొట్లాలు, అన్నీ తెచ్చి యిచ్చేవారు. వాసననూనెతో తలదువ్వి, జడలో పువ్వులుపెట్టి, దాన్ని ఎంతో చక్కగా సింగారించేవారు. జరీచీరలు, అత్తరులు, మిఠాయిలు, తాంబూలం, అన్నీ దానివంతు ! దీక్షాకౌపీనం, పంచసిగలు నా వంతు ! రాత్రి అయేసరికి మా వదిన గదిలో ఎంతో అలికిడిగా ఉండేది. ఆడవాళ్లు, పాటలు, ఫలహారాలు, తాంబూలాలు, నవ్వులు, అత్తరు ఘుమ ఘుమలు,........

ఆ వేడుకలలో, ఆ గడబిడలో నన్ను చూసేవాళ్లెవరు—ఒక్క ఆ పురోహితుడు తప్ప ? ఉదయం, సాయంత్రం, అగ్నిహోత్రం వద్ద గంటలకొద్దీ పొగలో నన్ను కూచోబెట్టి, చెవికోసిన మేకవలె ఏదో వల్లిస్తూ ఉండేవాడాయన. నాచేత సంధ్యావందనం తిన్నగా చెప్పించలేక, నానా చికాకూ పడి కళ్లెర్రజేసి, పళ్లుకొరుకుతూ, నన్ను తిట్టి, తనుతిట్టుకొని, యేదో అవస్త పడేవాడు.

పెంకె కుర్రవాళ్లు వీలు చిక్కినప్పుడల్లా నాతలమీద చరిచి, నన్ను కేళిచేసేవారు. ఉపనయనమంటే మొదట యేమీ తెలియక సంబరపడ్డానే కాని, జంఝప్పోస మెడల్లో పడడం పీకకు ఉరిపోసుకున్నట్లనిపించింది చివరకి. అర్థం తెలియని యీ సంధ్యావందనం, గాయత్రీజపం వల్లెవేయడ మెందుకో? తీవ్రంగా ఆలోచించేవాడిని, ఉపనయనమంటే ఏమిటని! ఎవరినడిగినా సమాధానం చెప్పరు సరికదా, మీదు మిక్కిలి యెగతాళి చేసేవారు. జంఝంతో వీపు గోకుకోవచ్చుననీ, జంఝం కుక్క మెడలో పడేస్తే చప్పున పెళ్లి అవుతుందనీ, జంఝం ముడి గట్టిగా నొక్కితే దెయ్యాలు వశమౌతాయనీ, 'గాయత్రీ సాక్షి!' అని జంఝం పట్టుకొని ప్రమాణం చేస్తూ యెంతేసి అబద్ధాలైనా చెప్పవచ్చుననీ, వడుగైతే హాయిగా బ్రాహ్మణార్థాలుచేసి బ్రతికేయవచ్చుననీ, ఎన్నో చెప్పేవారు.

"వడుగువలన నిజమైన ప్రయోజనం

ఏమిటండీ?"అని ఒకనాడు అడిగాను మా సాంబన్న మాస్టరు గారిని.

నవ్వుతూ ఆయన, "వటుగు అవడమంటే బిచ్చమెత్తుకుందుకు హక్కు పొందడమన్న మాట. ఉపనయన కాండకల్లా ముఖ్యమైనది భిక్ష!"అన్నాడు.

వటుగులో నేను మా బంధువులందరికీ ఒక్కొక్కరికే నమస్కరించి, 'భిక్షాం దేహి' అనడం, వాళ్లు నాపళ్లెంలో రూపాయలు, ఉంగరాలు వెయ్యడం, అన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాను. తుదకు తల్లిదండ్రులు, బంధువులు, పురోహితుడు, అంతా యేకమై, కుర్రవాళ్లకు వటుగునాడుచేసే మహోపదేశం ముష్టి యెత్తుకోవడమా అని నామనస్సు చాలా కించపడింది.

"ఆకాస్త నూలుపోగూ మెడలో పడితేనే కాని, మొహానికి బ్రాహ్మణకళ రాదు!" అనేది మానాయనమ్మ వటుగైన తరవాత. అద్దంలో చూసుకుంటే,ఒళ్లు మండుకొచ్చింది నాకు. అందవికారంగా తలగొరిగించి, పంచ సిగలుపెట్టి, యీగలు ముసురుతూ నెత్తిని చిన్నబెల్లంముద్ద నొక్కి, 'బ్రాహ్మణకళ వచ్చింది, చూసుకో!' అంటే, యేమైనా అర్థం వుందీ? 'బ్రహ్మచారీ శతమర్కటః' అంటారు. అంటే, 'నూరుకోతుల అందం వస్తుంది వటుగైనవాడికి!'అని అర్థం. అదే కాబోలు 'బ్రాహ్మణకళ' అంటే?

ఆడపిల్లనై పుట్టివుంటే నాకీ గ్రహచారం పట్టకపోవును కదా? చదువు, సంధ్య చక్కగా ప్రైమరీతో ఆఖరు! మాస్టర్లు, దెబ్బలు, పరీక్షలు, ఇంగ్లీషు—ఏగొడవా వుండదు. అప్పుడీ 'బ్రాహ్మణకళ', సంధ్యావందనం, పురోహితుడి తిట్లు యేవీ అవసరం లేకపోయేవి. ముచ్చటగా పదిపన్నెండేళ్లకి పెళ్ళి. పువ్వులు, మిఠాయిలు, అత్తరులు, వీటితో సారె. ఒంటినిండా నగలు, ఇంటినిండా పిల్లలు. పురుళ్ళు పుణ్యాలు, నోములు, అత్తగారితోను ఆడపడుచులతోను దెబ్బలాటలు, నగలకోసం చీరెలకోసం మొగుడితో సాధింపులు,.. బలే తమాషాగా వుండేది జీవితం! ఎందుకొచ్చిన మొగజన్మ?